వివర్ణం

నవ్యవార పత్రిక-20 డిశంబర్, 2006

వివర్ణం

అది అయిదోసారి ఆ చిత్రం వైపు సావధానంగా చూడడం.

ఎందుకో తెలియదు.

కదలలేక పోతున్నాను.

ఆ ప్రభావం రంగులదా? రేఖలదా?

వదలలేక పోతున్నాను.

అంత అద్భుతం అక్కడ ఆవిష్కరించబడిందా?

భుజాలెగరేశాను. పెదవి విరిచి ముందుకు కదిలాను.

అందమైన వరుసల్లో అమర్చివుంచిన చిత్రాలను ఒక్కోదానిని నా డిజిటల్ కెమేరాలో బంధించేస్తూ – ముందుకు నడిచాను.

తిరిగి మళ్ళీ అదే చోటికి. అదే చిత్రం ముందుకు వచ్చి నిలబడ్డాను.

అవే రంగులు. అవే రేఖలు.

సారూప్యమో... నైరూప్యమో...

వర్ణమో... వివర్ణమో...

నిశ్చలంగా ఉన్న నీటిపై గాలి అలలు రచించే నిశ్శబ్ద ప్రకంపనాల్లా... నాలో ఏదో తెలియని కదలిక.

లోలోన.

వెలుగులో... ఛాయలో ...

కెమెరా కన్ను మూసేశాను.

వాచర్ బెంచి మీద కూర్చున్నాను. నెమ్మదిగా చిత్రం వంకే దృష్టి నిలిపాను. ఆమూలాగ్రం దృష్టి సారించాను.

ఎందుకని ఆ చిత్రం నన్నింతగా ఆకట్టుకొన్నది?

నాకే నవ్వొచ్చింది.

రోజూ ఎన్నెన్నో చిత్రకళాప్రదర్శనలకు వెళ్ళడం - వాటిని రికార్డు చేయడం - ఎడిట్ చేయడం - రిలే చేయడానికి ఛానెల్‌కు పంపేయడం - నా నిత్యకృత్యం. ఒక రిపోర్టరుగా ఈ కళాభవన్‌లో ఎన్ని చిత్ర కళా ప్రదర్శనలు చూశానో... ఎందరు కళాకారులను సన్నిహితంగా చూశానో...

అయినా, ఈ చిత్రం నన్ను అమాంతం కట్టిపడేస్తున్నది.

అదే విచిత్రం.

ఓ కళా విమర్శకురాలిననీ, ఓ విలేఖరిననీ మర్చిపోయేలా చేసింది ఆ చిత్రం.

చిత్రకళా స్వరూప స్వభావాల గురించీ... విమర్శ విశ్లేషణల గురించి... నేను లోగడ చేసిన తర్కవితర్కాలన్నీ ఈ చిత్రపు ఉపరితలాన్ని తాకేట్టు లేవు.

ఆమూలాగ్రం పరిశీలనగా చూశాను.

ఓ గాజు బీకరు.

స్పెసిమన్లు సేకరించేది. సేకరించినవి భద్రపరచి ఉంచేది.

దానిలో ఇమిడ్చి ఉంచిన ఓ స్త్రీ !

ఆమె కళ్ళు అలవోకగా తెరిచే ఉన్నాయి. ఆమె ఒంటి రంగు, నేవళం, శరీర లావణ్యం ఆ గాజు ఉపరితలం లోంచి కనిపిస్తూనే ఉన్నాయి. ఆమె నాజూకు అరచేతులు ఆ దళసరి గాజుగోడని అదిమి వేస్తూనే ఉన్నాయి. ఆమె నిడుపాటి కురులు అలలు అలలుగా తడిలో తేలియాడుతూనే ఉన్నాయి.

ఆమె ఊపిరి పీలుస్తున్న ధ్వని నాకు వినబడసాగింది. నిశ్శబ్దంగా.

ఆమె గుండె లయ సన్నటి ప్రకంపనాలను సృష్టిస్తోంది. నిగూఢంగా.

ఏదో తెలియని భావం నన్ను నిలువునా కుదిపేసింది.

ఇలాంటి గాజు బీకరు నాకు బాగా పరిచయం ఉన్నట్లే అనిపించింది.

నిజమే, నాకు జ్ఞాపకం వస్తోంది. అచ్చం ఇలాంటి గాజు బీకరును నేను ఎరుగుదును.

రెండు దశాబ్దాల క్రితం సంగతి.

అప్పట్లో మా పాలమూరులో సైన్స్ ఫెయిర్ పెట్టడం ఓ పెద్ద వింత. విశేషం.

ఆ సందర్భంగా, గీతా టీచర్ మా బడికి సరిగ్గా ఇలాంటి గాజు బీకర్లనే తీసుకువచ్చారు. పెద్దవి, చిన్నవి, దళసరివి, పలుచటివి, నిలువు లోటాల్లాంటివి.

ఒక్కో బీకరు పైన మూతపై గాజుగోళీ.

అప్పుడే మొదటిసారిగా చూసింది.

పాములు, కప్పలు, బొద్దింకలు -! అబ్బ - యాక్ ! ఓ అమ్మాయి కళ్ళు తిరిగి కింద పడిపోయింది.

మూత్రపిండాలు, మెదడు, గుండె ఒక్కటేమిటి...ఏకంగా ఓ కంకాళమే తెచ్చి పెడితే !

అమ్మో - ఆ దడుపు ఆగడానికి ఎన్నాళ్ళు పట్టిందో !

వద్దుమొర్రో అంటే వినకుండా తననూ అపర్ణనూ బయాలజీ టీచర్ తన గ్రూప్‌లో పెట్టేశారు.

జీవరహితమైన ఆ శరీరభాగాలు, సరీసృపాలు, క్షీరదాలు, కీటకాలు - ఒక్కో గాజుబీకరు ద్రావకంలో తేలుతూ ఉండిన దృశ్యాలు - ఎన్నాళ్ళో పీడ కలలుగా వెంటాడి వదిలేవికావు. ఆ ద్రావకపు ఘాటైన వాసన ఇంటికి వెళ్ళి తలారా స్నానం చేసినా వదిలేదా? అసలు అన్నమే సహించేది కాదు. అమ్మతో చీవాట్లు తప్పేవి కావు.

కప్ప నోట్లో పొగాకు కుక్కి - కార్డుబోర్డుపై వెల్లకిలా పడుకోబెట్టి - కాళ్ళూ చేతులకు చీలలు కొట్టి - అది బ్రతికుండేట్లుగా నిలువునా కోసి -ప్రదర్శనలో పెట్టడం...అబ్బో!

బయల్పడిన దాని అవయవాలు - కొట్టుకుంటున్న దాని చిన్ని గుండె తడి - ఈ రోజటికీ కళ్ళల్లో మెదులుతుంది. కడుపులో కెలికినట్లవుతుంది.

గీతా టీచర్ అంతటితో ఊరుకుంటే బాగానే ఉండేదేమో - తననీ అపర్ణనీ గాజు బీకర్లనన్నిటినీ సర్దే పనికి పురమాయించింది.

మూడు రోజుల ఆ ప్రదర్శనలో - రోజూ ఉదయాన్నే బల్లలపై వాటన్నిటినీ సర్దడం - మళ్ళీ సాయంత్రం అద్దాల బీరువాల్లో సర్దేసి - తాళాలు వేయడం - తమ పని.

చివరి రోజున -

హృదయం పెట్టిన బీకరును జాగ్రత్తగా మోసుకు వస్తూ - ఎదురుదెబ్బ తగిలి - ఢామ్మని ముందుకు పడింది అపర్ణ.

బీకరు ముక్కలయింది. ద్రావకం గదంతా చిందింది.

గాజు ముక్కలు హృదయంలోకి గుచ్చుకుపోయాయి.

అపర్ణ మోకాలు చిట్లింది. మోచేయి దోక్కుపోయింది. నుదురు చిట్లింది.

ఘాటైన ఆ వాసనకు కడుపులో తిప్పుతుంటే -

టీచర్ చీవాట్ల మధ్య వెక్కుతూ బెక్కుతూ - వంటరిగా నేల మీద కూర్చుని - అపర్ణ ఒక్కో గాజు ముక్కను ఏరడం - ఇంకా గుర్తుంది. కన్నీటితో తడిచి నుదుటిపై అతుక్కున్న ముంగురులు, బిక్కముఖం.

గుండెల్లో గుచ్చుకొన్న ఆ సన్నటి గాజుముక్కలను జాగ్రత్తగా తీయాలని అపర్ణ ప్రయత్నించిన కొద్దీ - జీవరహితమైన ఆ హృదయం - ఛిద్రమై ఛిన్నాభిన్నమైంది.

ఆ దృశ్యం నన్ను వెన్నాడుతూనే ఉంది. ఆ ఘాటైన రసాయనపు వాసనలా.

తల విదిల్చాను. మెల్లిగా లేచి నిల్చున్నాను.

'కావచ్చు, బహుశా ఆ జ్ఞాపకం వల్లనే ఈ చిత్రం నన్ను ఆకట్టుకొని ఉండొచ్చు.'

నెమ్మదిగా లేచి చిత్రానికి దగ్గరగా వెళ్ళి నిల్చున్నాను.

ఇప్పుడు ఏ ఉద్వేగం లేకుండా ఆ చిత్రాన్ని చూశాను.

అవును, అది ఒక సాధారణమైన బీకరు.

ఆమె ఒక సామాన్యమైన స్త్రీ.

చిత్రకారుని సంతకం కోసం వెతికాను.

లేదు.

కళాకారుల పైత్య ప్రకోపాలు నేను ఎరుగనివా? చీటికి మాటికి బుంగమూతి పెట్టే పిల్లలలాంటి వాళ్ళు!

నేరుగా ఎగ్జిబిషన్ వాలంటీర్‌ను కలిశాను. ఆ చిత్రకారుని ప్రొఫైల్ ఇమ్మని అడిగాను.

"సారీ... అది వ్యక్తిగతం. ఎవరికీ ఇవ్వకూడదని వారి కోరిక" ఆమె సున్నితంగా తిరస్కరించింది.

జెర్కిన్‌లో నుంచి నా ఐడెంటిటీ కార్డ్ తీసి ఆమెకు ఇచ్చాను.

"ప్రెస్ !" అన్నా ధీమాగా.

ఎవ్వరికీ ఇవ్వ కూడదని కోరారనడంలోనే ఉంది - నాలాంటి వాళ్ళకి దూరంగా ఉంచమన్న కోరిక! కళాకారుల చిత్త ప్రవృత్తులు నాకు తెలిసినవేగా! క్షణ క్షణముల్ అని - ఏకాంతంలో ముడుచుకు పోయిన వారెందరు బహిర్గతం కాలేదు? చిన్న ప్రయత్నం. ఫలిస్తే సరేసరి! కానీ, ఈ పూజారి వరమిస్తే కదా - ' ఆ వాలంటీర్ వంక చిరునవ్వుతో చూస్తూ ఉన్నా.

ఆ అమ్మాయి కాస్త తటపటాయించి, కాసేపు నన్ను ఎగాదిగా చూసి - నా కార్డు నా చేతికి ఇచ్చేసి - వెనక్కు తిరిగి వెళ్ళింది. నేను జేబుల్లో చేతులు పెట్టుకొని అంకెలు లెక్కపెడుతూ నిల్చున్నాను.

వెళ్ళినంత వేగంగా ఆ అమ్మాయి తిరిగి వచ్చింది. వస్తూ వస్తూ ఆ చిత్రకారుని పేరు, చిరునామా పట్టుకొచ్చింది.

లోపల ఎంత కుతూహలం ఉన్నా ఆత్రుతను అదిమిపెట్టి గంభీరంగా ఆ కార్డును తీసుకొన్నాను.

అపర్ణా రంజిత్ !

విచిత్రం!!

ఇదేదో అభూత కల్పనలా ఉందే!

ఈ అపర్ణ మా అపర్ణేనా?

ఎక్కడి పాలమూరు? ఎక్కడి ఇంద్రప్రస్థపురం?

నా ఆసక్తి రెండింతలయ్యింది.

ఆ... అయినా, ఉత్తరాది వాళ్ళలో ముఖ్యంగా బెంగాలీలలో అపర్ణ పేరు సర్వ సాధారణం. అయితే మాత్రం, ఆ పేరు చాలదా స్నేహ భావం మొలకెత్తడానికి?

"నేను ఆవిడను కలవచ్చా?" ఆ అమ్మాయిని మళ్ళీ అడిగాను – నాలోని ఉత్సాహాన్ని కాస్త అణిచి పెడుతూ.

"ఆమె సాధారణంగా ఎవరికీ ఇంటర్వ్యూ ఇవ్వరు. ఎందుకయినా మంచిది ముందుగా కనుక్కొని వెళ్ళండి –"

"థాంక్యూ!" హుషారుగా ఆ అమ్మాయికి షేక్‌హ్యాండిచ్చి – నా సరంజామాతో బయలుదేరా సంబరంగా.

నేరుగా అపర్ణ ఇంటికి.

చిన్న పిల్లలా.

*

అపర్ణ వాళ్ళ ఇంటి తలుపు తెరుచుకొనే లోగా... ఆ ఉద్వేగం ఉవ్వింతలయ్యింది.

ప్రొఫెషనల్ లుక్ ముఖానికి అతికించుకోవడానికి కాస్త శ్రమ పడాల్సి వచ్చింది.

ఎన్నిసార్లు నుదుటికి పట్టిన చిరు చెమటను తుడుచుకొన్నానో... ఎన్నిమార్లు చేతి వేళ్ళు విరుచుకొన్నానో... ఇంకెన్నిసార్లు పెదవులు తడి చేసుకొన్నానో... నాకే తెలియదు.

అదుగో... తలుపు తెరుచుకొంటోంది.

దబాలున తెరిచేసింది. నా ఎదురుగా నిలబడిన ఒక రెండు జడల నడి వయసు స్త్రీ. బహుశ పని మనిషో వంట మనిషో అయివుండవచ్చును. పంజాబీ యాసలో పలుకరించింది.

బీవీజీని పిలవమన్నాను.

ఓ మారు నన్ను ఎగాదిగా చూసి, ఆమె లోపలికి వెళ్ళింది. తలుపును గట్టిగా బిగించి.

నా వాలకం చూసి ఏ సబ్బులో పౌడర్లో అమ్మే వాళ్ళనుకుందేమో... పాపం!

చాలా సేపు ఆమె తిరిగి రాలేదు. ఔననలేదు, కాదనలేదు, చేసేది ఏముంది? ఆ గుమ్మం ముందు అసహనంగా పచార్లు చేస్తున్నాను.

మనీ ప్లాంట్ జాలీ నిండుగా అడ్డదిడ్డంగా పెరిగి పోయి ఉంది. దాని చాటుగా నేమ్ ప్లేట్... కె. ఆర్. రంజిత్ కుమార్.

ఓహో... అపర్ణ వాళ్ళాయన మిలటరీలో గ్రేడ్ వన్ ఆఫీసర్ అన్నమాట!

తలుపు తెరుచుకున్న శబ్దానికి గిరుక్కున తిరిగాను.

శ్రద్ధగా మలిచిన చిత్రం లాంటి చక్కని రూపవతి.

ఆమె అపర్ణే కావచ్చు.

నిస్సందేహంగా... మా అపర్ణకాదు.

ఆమె అపర్ణే. అపర్ణా రంజిత్.

"నమస్తే" మర్యాదగా పలకరించాను. వచ్చిన పని చెప్పాను. ఎలా వచ్చానో చెప్పాను. ఆమె విశాలమైన కళ్ళల్లో ఎలాంటి కుతూహలం కనబడలేదు. నిర్లిప్తత ఓ నీలి నీడలా ఆ కళ్ళల్లోంచి ఆమె ముఖంలోకి విస్తరించింది. అది నా భ్రమే కావచ్చు కాక!

తలుపు ఓరగా తీసి, తల మాత్రం బయటకు పెట్టి నన్ను పలకరించిన ఆమె... నన్నింకా లోపలికి రమ్మని ఆహ్వానించ లేదు. కనీసం ఆహ్వానభరితమైన చిరునవ్వు కూడా లేదు.

నేను కాస్త వెనకా ముందాడుతూ నిల్చున్నాను.

ఇలాంటి అవాంఛిత ఆహ్వానం నాకు కొత్తేమీ కాదు. రవి కాంచని చోట విలేఖరి చొరబడున్! కానీ, ఎలా చొచ్చుకు పోవడమా అని... ఆలోచిస్తున్నాను.

నా ఆలోచనలు నా ముఖాన ప్రతిఫలించకుండా చెదరని చిరునవ్వుతో నిల్చున్నాను. "అవని" ఆమె అడగకుండానే నా పేరు కూడా చెప్పేసాను. ఊహు! అపర్ణ నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేదు. మర్యాదకైనా.

అపర్ణ నెమ్మదిగా తలుపు వేసింది.

నేను తలవాల్చి నిల్చున్నాను. తలుపు ముందున్న తడి మెట్లపై.

ఆమె తిరిగి వస్తుందని నాకెందుకో బలంగా అనిపిస్తోంది. చెవులు రిక్కించాను. తలుపు గడి తీసిన శబ్దమో ఆమె పాదాల సవ్వడో వినబడుతుందని.

ఊహు!

ఇక లాభం లేదని వెనక్కు తిరిగాను.

ఆ ఇంటి ఎదురుగా ఉన్న అంగడి దగ్గర ఆగాను. ఏం తీసుకుందామా అని ఆలోచిస్తూ... అక్కడి అరల్లో అమర్చిన వస్తు సమూహాన్ని తిండి పదార్థాలనూ గమనిస్తూ నిల్చున్నాను.

ఇంతలో ఎవరో నా భుజాన తట్టి పలకరించబోయారు.

నా ఊహ నిజమే.

అపర్ణ.

తనతో రమ్మన్నట్లుగా సైగ చేసింది.

నేను ఆమె వెనుక నడిచాను.

రెండు మలుపులు తిరిగాక వీధి మూలగా ఉన్న కాలనీ పార్క్ వద్ద ఆమె ఆగింది.

ఇద్దరం లోపలికి నడిచాం, పక్కపక్కనే కూర్చున్నాం, మౌనంగానే.

బడి సమయం, పిల్లలు లేని ఊయలలు, జారుడు బండలు. అక్కడక్కడ మొలిచిన గడ్డి, గోడవారగా పెంచిన ఫెన్సింగ్ మొక్కలు.

ఎప్పుడో బర్రుమంటున్న వాహనం.

ఎక్కడో తోపుడు బండి వ్యాపారుల కేకలు.

అంతా నిశ్శబ్దంగా ఉంది. మా ఇద్దరి మధ్యనా ఉన్నట్లే.

ఆ మౌనంలోనే మా ఇద్దరి నడుమ చక్కటి అవగాహన కలిగింది.

ఆమె ఏదో చెప్పడానికి సిద్ధమై వచ్చింది.

ఆమె చెప్పబోయేది వినడానికి నేను సిద్ధమై ఉన్నాను.

వృత్తి నేర్పిన మెళుకువో నా సహజ స్వభావమో... మొదట నేనే మాట్లాడడం మొదలు పెట్టాను. అపర్ణ పేరు నాలో కలిగించిన స్నేహభావాన్ని గురించి, మా చిన్ననాటి ముచ్చట్ల గురించి, మేం ఇద్దరం కలిసి పెద్దలను పెట్టిన ముప్పతిప్పల గురించి, ఆడిన ఆటల గురించి, పాడిన పాటల గురించి.

ఆమెకు నా వయసే ఉండొచ్చు. ఆమె అపర్ణే కావచ్చు.

అవేవీ కావు. అయితే, అలా కాకపోవడం మా నడుమ స్నేహభావాన్ని, సాన్నిహిత్యాన్ని మొలకెత్తించడంలో అడ్డంకులేమీ కాలేదు.

ఆమె భర్త మిలటరీలో గ్రేడ్ వన్ ఆఫీసర్. పిల్లలు ప్రొఫెషన్ కోర్సులు పూర్తి చేయబోతున్నారు. డెబ్భైవ దశకం ఆరంభంలోనే ఆమె తన మెడిసిన్‌ను పూర్తి చేసింది. ఇదీ ఆమె ముఖ పరిచయం. ఇక ముఖాముఖిన ముఖ్యమైన విషయాల్లోకి వెళ్ళాలి. ఆమెకు నాపై ఒక సానుకూలత కలిగేట్లుగా నా సంభాషణను పొడిగించసాగాను.

ఎన్నెన్నో రంగులను ఆవిష్కరించిన ఆమె సున్నితమైన చేతి వేళ్ళు నలిగిపోతున్నాయి. ఆమె ఆలోచనల ఉద్వేగంలో. ఆమె ముఖం కందిపోతున్నది.

అపర్ణ మాట్లాడటం మొదలు పెట్టింది.

నాతో పంచుకోవడానికే ఆ మాటలన్నింటినీ ఇన్నాళ్ళుగా తన గుండెల్లో మూటగట్టి ఉంచిందేమోనన్నంత ఉద్విగ్నత... ఆమె పలుకుల్లో ధ్వనిస్తోంది.

ఏ చిన్న కదలిక అయినా ఆమెను ఆపి వేస్తుందేమో నన్నట్లుగా నేను మెదలకుండా కూర్చున్నాను. చెవులను, కనులను అపర్ణకు అప్పగించి. చాలా శ్రద్ధగా ఆమె మాటలను వినడం ప్రారంభించాను. ఒక్కో మాట నా ప్రమేయం లేకుండానే నా మనసులోకి ఇంకిపోసాగింది. కాగితం పైని సిరా చుక్కలా.

"పోనీలే అనుకున్నా..." అపర్ణ అంది, "ఇదంతా మామూలే... నేనే సున్నితంగా స్పందిస్తున్నానేమో ననీ...! కానీ, అలా అనుకుంటూ ఎక్కువ కాలం ఉండలేకపోయాను..."

*

మేం నలుగురు పిల్లలం. నాన్న బడి పంతులు. అమ్మ గృహిణి. మమ్మల్ని అమ్మ చాలా గుట్టుమట్టుగా పెంచుకొచ్చింది.

నాన్న ఓ ప్రగతి వాద పార్టీలో చాలా సాధారణమైన కార్యకర్త. అయినా, పార్టీ కార్య కలాపాలకు మా ఇల్లు ఓ కేంద్రంగా ఉండేది. అదేదో ముఖ్యమైన విషయంలా ఇంట్లోని వాళ్ళం ఎవరం అనుకొనేవాళ్ళం కాదు. అది మా జీవితంలో ఓ భాగంగా కలిసిపోయింది. మేము విడదీసి చూసేవాళ్ళం కాదు. ఎప్పుడూ వచ్చేవాళ్ళు పోయేవాళ్ళు. ఇల్లంతా సందడి.

పిల్లలుగా మాకు సరదాగానే ఉండేది. అయితే, మా నలుగురి కడుపు నింపడానికే కిందా మీదా పడుతోన్న మా అమ్మ ఈ అతిథుల తాకిడికి విలవిలలాడేది. ముప్ప తిప్పలు పడైనా వారి అవసరాలు తీర్చేది. పెదవి విప్పి ఏనాడు తన ఇబ్బందులు ఎవరితోనూ చెప్పలేదు.

అలాగే, వాళ్ళెవరూ అమ్మ ఎలా వారి పళ్ళెం నింపుతుందో ఆలోచించారని నేను అనుకోను. వారి ఆకలి తీర్చడానికి రొట్టె పప్పు అందేవి, నిరాఘాటంగా.

అన్నయ్య మెడిసిన్‌లో చేరాడు. మాకు ఇక అన్ని సమస్యలూ తీరిపోతాయనుకొన్నాం. ఇంతలో, అన్నయ్య ఉద్యమంలో చేరాడు. అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. ఎప్పుడో ఎవరో స్నేహితుల ద్వారా వార్తలు చేరేవి. క్షేమంగా ఉన్నాడని.

ఓ తెల్లవారు ఝామున అతనే తిరిగి వచ్చాడు. డస్సిపోయినట్లుగా. వాకిట్లో పడి ఉన్నాడు. అతను మామూలు మనిషి అయ్యేసరికి మా అందరి తలప్రాణాలు తోకల కొచ్చాయి.

ఇంతలో పార్టీని నిషేధించారు. అన్నయ్య మళ్ళీ మెడిసిన్‌లో చేరాడు. పూర్తి చేయాలని సంకల్పించాడు. అయితే, మా ఇంటి నుండే తన కార్యకలపాలను కొనసాగించేవాడు.

కుటుంబ సభ్యులందరమూ చాలా ఉత్సాహంగా పాల్గొనేవాళ్ళం. ఏ చిన్న పని చేయగలిగినా ఘనకార్యం చేసినట్లుగా ఉప్పొంగి పోయేవాళ్ళం.

అప్పటికి నేను చిన్నపిల్లని కదా... అన్నయ్య అతని స్నేహితులు నన్ను చిన్న పిల్లలాగానే గారాబం చేసేవారు. కళ్ళంతా విప్పార్చి వాళ్ళ కబుర్లు వింటుండేదానిని.

ముఖ్యంగా, స్త్రీల గురించి, వారి సమానహక్కుల గురించి వారు మాట్లాడుకొంటుంటే - చాలా సంతోషం వేసేది. సమభావనలతో నిండిన ఒక సంస్కార సమాజం ఆవిష్కరించాలని వారంతా ప్రతిజ్ఞలు చేసుకొంటుంటే - ఎంత గొప్పగా అనిపించేదో! నాలో నేను ఎంతో ఉత్తేజితురాలినయ్యే దానిని.

వారి ఆదర్శాల కలలు రంగుల్లో సాగేవి. అన్నయ్య స్నేహితులు ఎక్కువగా కవులు, ఉపన్యాసకులే అయినా, గాయకులు, చిత్రకారులు కూడా ఉండేవారు.

ఎంత సందడిగా ఉండేదో వారి రాకపోకలతో. వారు వస్తూ వస్తూ - చక్కటి బొండు పుస్తకాలను, అందమైన ముద్రణలతో నిండిన పత్రికలను తమతో తీసుకువచ్చేవారు.

నిజానికి, వాటిల్లో మాకు తెలిసిన ప్రదేశాలు కానీ, మనుషులు కానీ -లేవు, లేరు. ఆ చెట్లు, పక్షులు, పువ్వులు, జంతువులు - మనం ఎప్పుడూ చూడలేదు. ఆ కథలు, పాత్రలు, స్వభావాలు మనకు తెలియదు. వారి జానపదాలు, పండుగలు, నమ్మకాలు, వ్యవహారాలు - మనవి కావు.

అయినా, ముట్టుకుంటే మాసిపోయే మిలమిల లాడే కాగితాలపై రంగురంగుల వర్ణచిత్రాలు నన్ను ఆకర్షించేవి. బొమ్మలు గీయడం గురించీ, రంగులద్దడం గురించీ - తరుచూ ఆ పుస్తకాల్లో వ్రాసేవారు. అలా ఎప్పుడు నా చేతిలోకి కుంచె వచ్చిందో నాకే తెలియదు.

ఆ పుస్తకాల్లో విమానాలను నడిపే స్త్రీలు, ఆకాశంలోంచి అంతరిక్షం లోకి దూసుకుపోయిన మహిళలు, జిమ్నాస్టిక్స్ చేసే అమ్మాయిలు, ఈతలు కొట్టే అతివలూ - ఎందరెందరో ఉండేవారు.

అన్నయ్యా, ఆయన స్నేహితులు ఆ అమ్మాయిల పొడవాటి కాళ్ళ గురించి, నునుపైన చేతుల గురించి, బుగ్గల నేవళం గురించి, కళకళలాడే ముఖాల గురించి బోలెడన్ని చిలిపి కబుర్లు చెప్పుకొనేవారు. అమ్మా నాన్న అటు వచ్చారో - వారంతా గప్ చుప్!

నాకు ఆ అమ్మాయిల ముఖంలోని ధీమా నచ్చేది. అద్దం ముందు నిలబడి నేనూ వాళ్ళలా గడ్డం పైకెత్తి, సూటిగా చూస్తూ, చక్కగా నవ్వడానికి ప్రయత్నించే దానిని.

ఆ రోజులు ఎంత బావుండేవో - ఎన్ని రోజులు చిలకడ దుంపలతో పూటలు గడిపినా, ఉడకేసిన వేరుశనగలో, ముల్లంగి దుంపలో ఆకలి తీర్చినా - సంతోషంగానే అనిపించేది.

ఇంతలో అన్నయ్యకు ఒక పెళ్ళి సంబంధం వచ్చింది. మా దూరపు బంధువుల అమ్మాయి. అతి కష్టంపై ప్రాథమిక విద్య పూర్తి చేసింది. అంతలోనే ఆమె వివాహం. కాపురానికి వెళ్ళక మునుపే కాలువలో మునిగి ఆమె భర్త కాలం చేశాడు.

ఆదర్శ వివాహమని వెంటనే ఒప్పుకున్నాడు అన్నయ్య. నిజానికి, అమ్మా నాన్నలే వప్పించారని అనాలి. ఆమె, మా వదిన, పాతిక ఎకరాల మాగాణితో ఏడువారాల నగలతో – మా ఇంట్లో అడుగుపెట్టింది.

రెండో వివాహమన్న స్పృహ వల్లనో –ఆదర్శ వివాహం అన్న కృతజ్ఞతలో మునిగో – ఏమీ ఎరుగని అమాయకత్వం వల్లనో – మా లక్ష్మి వదిన అణిగి మణిగి ఉండేది. తడిచిన పిల్లిలా ఏదో మూలన ముడుచుకుంటూ. తన పాదాల సవ్వడి తనకే వినబడనంతగా మెత్తగా నడుచుకుంటూ.

వదిన పంట సొమ్ముతో కుటుంబమంతా కుదురుకున్నాం. అమ్మా నాన్న కూరగాయల తోటలు వేశారు. మెల్లిగా కొద్దిపాటి వ్యవసాయం మొదలు పెట్టారు. మేమంతా చదువుకోగలిగాం. ఇంటి పై జమ్ము కప్పు తీసేసి స్లాబ్ వేసుకున్నాం. ఇంట్లోకి ఒక్కో వస్తువూ అమర్చుకోసాగాం.

ఇలాంటి సమయంలో అన్నయ్య ఇంటిపై పిడుగు వేశాడు ఎలాంటి ఉరుములు మెరుపులు లేకుండానే.

తను సౌదీకి వెళుతున్నానని, వదినను తనతో తీసుకెళ్ళడం వీలుకాదని.

ఏదో ఉన్న ఊళ్ళో ఉద్యోగం చేసుకుంటూ అందరికీ ఆదరువు అవుతాడనుకొన్న అన్నయ్య ఇలాంటి నిర్ణయం తీసుకోవడం – త్వరగా మింగుడు పడలేదు. నాన్న ఉద్యోగ విరమణ చేశాడు. వయసు మీద పడుతుంది. చిన్నా చితకా పనులు వంటరిగా చేయలేకపోతున్నాడు.

లక్ష్మి వదిన రెండోమారు గర్భవతి. వళ్ళో పిల్లాడు.

అందరం విమానాశ్రయానికి వెళ్ళాం. అక్కడ తెలిసింది అన్నయ్య మా కోసం వుంచిన అసలు ఉత్పాతం!

ఆయన వంటరిగా వెళ్ళడం లేదు. తన ఉద్యమ నేస్తం, సహాధ్యాయినితో వెళుతున్నాడు. మతం మార్చుకొని మరీ! ఆమె చేతిలో ఒక బిడ్డ. వదిన బిడ్డ కన్నా ఒక ఏడాది పెద్దదే!

అంతే!

ఎక్కడి వారమక్కడ నిర్ఘాంత పోయి నిలబడిపోయాం!

అన్నయ్య తెలియక చేశాడని ఎలా అనగలం?

తెలిసి తెలిసీ ఇద్దరు స్త్రీల జీవితాల్లో ఇలాంటి అనుభవం మిగల్చడం - ఛ!

అమ్మా నాన్నలు కుప్ప కూలిపోయారు.

అటు - కోడలు ఏమీ తెలియని అమాయక బైతు.

ఇటు కొడుకు - అన్నీ తెలిసిన ఉద్దండుడు.

వీరిరువురికి అతీతంగా - ఎన్నో తెలిసిన విద్యావతి.

ఏమి అనుకొని ఏం ప్రయోజనం ? ఇలాంటి అనూహ్య పరిస్థితి వస్తుందని ఎవరికి తెలుసు? అందులోనూ అన్నయ్య...! ఇలాంటి నిర్వాకం చేస్తాడని ఎలా ఊహించగలం? స్త్రీల సున్నిత మనోభావాల గురించి ఎంత అందంగా మాట్లాడేవాడో...! ఇద్దరు స్త్రీల నడుమ ఎలాంటి కఠినమైన మనో వేదనకు కారణభూతమయ్యాడు!

మెల్లిమెల్లిగా విషయాలు తెలిసాయి. లక్ష్మి వదిన ఏడువారాల నగలూ ఒక్కోటిగా అన్నయ్య తీసుకెళ్ళి పోయాడు! వదిన సొమ్ముతోనే మరొక కాపురాన్ని తీర్చి దిద్దుకొన్నాడు! ఛ ఛ!

ఎంత అమాయకురాలైనా వదినకు మాత్రం అనుభూతులు లేవా? ఆలోచనలు ఉండవా?

ఆదర్శమని గొప్పగా చేసుకొన్న ఆమె దండలపెళ్ళి – మా అందరి సాక్షిగా ఇలా నిప్పుల గుండమై నిలిచింది.

అన్నయ్య ఆదర్శ వచనాలు ఒక్కోటి గుర్తొచ్చి – మరింత కుంగిపోయాం. అతని నోట వొలికిన ఆ ఉన్నత భావాలే మెత్తని కొరడాల్లా మమ్మల్ని తాకేవి. తలుచుకొన్న కొద్దీ కంపరం, దిగులు, విషాదం.

అన్నయ్య వెళ్ళిపోయాడు.

వదిన బిడ్డలతో సహా మా ముందు నిలబడింది.

ఆమె ఏ అఘాయిత్యం చేసుకుంటుందోనన్న భయం. ఆమెకు జరిగిన అన్యాయం తలుచుకున్నప్పుడల్లా దుఃఖం.

అలాంటప్పుడు పార్టీ కానీ, పార్టీ మిత్రులు కానీ మాకు ఎలాంటి నైతిక బలాన్ని ఇవ్వలేదు. వెన్నుదన్నుగా నిలవలేదు. పూర్తిగా నిర్లిప్తత చూపింది, మౌనం వహించింది. అలా తన ఆగ్రహాన్ని ప్రకటించేసింది. అందరి రాకపోకలు ఆకస్మికంగా ఆగిపోయాయి.

కొత్తల్లో నాన్న ఊపిరి ఆడనట్లు ఉక్కిరి బిక్కిరి అయ్యేవాడు. ఆ ఆదర్శ ప్రపంచమే ఆయన ఆయువు పట్టని మాకు అర్థమైంది. ఆయన ఆయనలా లేరు. తన నమ్మకాలకు దూరంగా నెట్టేయబడటంతో విలవిలలాడిపోయారు.

అన్నయ్య చేసిన తప్పుకు తనే బాధ్యత వహించాడు. నడిచే శవంలా తయారయ్యాడు.

క్రమక్రమంగా పార్టీ కార్యకలాపాలకు మేము దూరంగా జరిగిపోయాం. లోలోపలికి కుంచించుకుపోయాం. చిప్పల్లోకి ముడుచుకు పోయే తాబేళ్ళలా.

లోపల చితికిపోతూ పైకి గంభీరంగా తిరుగాడసాగాం.

అన్నయ్య నిర్వాకం అటుంచి, తన పార్టీ వారంతా తన జీవితకాలపు శ్రమను విధేయతను ఒక్క వేటుతో వెలివేసినట్లుగా ప్రవర్తించడం నాన్నకు కొరుకుడు పడలేదు. ఎందరినో ఆశయాల బాటలో తీర్చిదిద్దిన నాన్న - అన్నయ్య ప్రవర్తన వలన దోషిలా పక్కకు తోసేయడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఇది దెబ్బపై దెబ్బ.

నేను ప్రాక్టీసు మొదలు పెట్టాను. చాలా చిన్న క్లినిక్. నా సీనియర్ ఆనంద్ నాకు ఎంతో సహాయం చేసేవాడు. అప్పుడప్పుడు వచ్చి కేస్ డిస్కషన్స్ చేసేవాడు. అన్నయ్య గురించి మాట్లాడేవాడు. మాకు అన్నయ్య సీనియర్. కాలేజీలో ఎందరెందరికో ఆదర్శాలను నూరిపోసినవాడేగా!

ఆనంద్ నచ్చ చెప్పటానికి ప్రయత్నించేవాడు.

ఎన్ని చెప్పినా, పెదవులు దాటని ఆదర్శాలు, అబద్ధాల అతుకుల బతుకు నాకు నచ్చలేదని నిక్కచ్చిగా చెప్పేశాను. ఏ ఆదర్శాల పాలు తాగి పెరిగాడో- ఏ భావజాలం అతనిని పెంచిందో - దాని నుంచి అర్ధాంతరంగా పారిపోవడం - అందరానంత దూరంగా పారిపోవడం - అస్సలు నచ్చలేదు. మత తత్వానికి వ్యతిరేకంగా పని చేస్తూ - అటు ఉద్యోగం కోసం ఇటు బహుభార్యాత్వాన్ని చట్టబద్ధం చేసుకోవడం కోసం - మతం ముసుగు వేసుకోవడం - ఎలా నచ్చుతుంది? పై నుంచి, ఆ మాట అన్నయ్య నోటితోనే చులాగ్గా అనేస్తే...? వళ్ళు మండిపోదూ...?

ఆనంద్ ఏదో సర్ది చెప్పాలని ప్రయత్నించేవాడు.

ఆనంద్ మీద విరుచుకు పడేదానిని. "ఒక మగవాడిలా మాట్లాడుతున్నావ్ నువ్వు కూడా!" అంటూ.

"అతను పిరికివాడు, పారిపోయాడు, వంటరిగా నిలబడలేక, నలుగురిలో తలెత్తుకోలేక."

"ఆ మాత్రం ధైర్యం నేర్పలేదా అతని రాజకీయ జీవితం? తనకు కావల్సిందేమిటో తనకే తెలియనంత అమాయకంగా తీర్చిదిద్దిందా అతని సిద్ధాంతం? తన గురించే తనకు స్పష్టత లేనివాడుగా, బాధ్యత లేనివాడుగా ఎలా తయారయ్యాడసలు?"

"వప్పుకొంటాను. ఈప్రణాళికాబద్ధ సిద్ధాంత బోధలన్నీ వ్యక్తి మానస చేతనకు మేధో చింతనకు ఒక తాత్విక పునాది మాత్రమే. వ్యక్తి విలువలు అతని స్వతంత్ర ఆలోచనల్లోంచి రూపుదిద్దుకోవాలి. ఒక చట్రంలోకి మనిషిని బిగించలేం, బంధించలేం. చేతనావస్థ కలిగేలా ఒక వాతావరణాన్ని మాత్రమే కలిగించగలం. మనిషి స్వేచ్ఛాభిలాషి, అంతఃశోధన, స్వీయసాధన లేనప్పుడు – మనం ఎందుకు మాట్లాడుకోవడం?"

నిజమే, అన్నయ్య ఆదర్శాలు అలవాటుగా వచ్చినవే కానీ, మరోటి కావు.

అన్నయ్య పూర్తిగా ఓడిపోయాడు. ఆయన ఓటమి మా కుటుంబానికి పెద్ద దెబ్బ.

ఆనంద్‌తో నా స్నేహం బలపడసాగింది. చెల్లెళ్ళ చదువులు పెళ్ళిళ్ళు పూర్తవగానే – మేమిద్దరమూ ఒక కుటుంబంలా స్థిరపడాలనుకొన్నాం. చిన్న చెల్లెలి పెళ్ళికి వచ్చి – మిత్ర బృందంతో సహా తిరిగి వెళ్ళిన ఆనంద్ –వారందరితో సహా మళ్ళీ ఎవరి కంటా పడలేదు.

అజ్ఞాతంలోకి వెళ్ళాడని అనుకున్నాను. ఎప్పుడో ఒకరోజు నా ముందుకు హఠాత్తుగా వచ్చి నిలబడతాడనుకొన్నాను. కానీ, ఏదో ఒక చిన్న పత్రికలో ఒక మూలన రాసిన రెండు వాక్యాలలో అతను మలిగిపోయాడు.

ఈ దెబ్బ లోంచి నేను తేరుకోలేకపోయాను. లోలోన కుంగిపోసాగాను.

అమ్మా నాన్నలతో ఆనంద్‌తో నాకున్న సాన్నిహిత్య సంబంధం గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. ఎందరో పార్టీ మిత్రులలో ఇతనొకడని భావించారేమో, - పార్టీ కార్యకర్తలపై బహిరంగంగా దాడులు దౌర్జన్యాలు జరుగుతున్న రోజులవి. వాటిలో ఇది ఒక సంఘటనగా వారు భావించి ఉండవచ్చు.

బహుశా అందువల్లనేమో - రంజిత్ సంబంధం వచ్చినప్పుడు వారు వెంటనే సానుకూలంగా స్పందించారు. ఈడు జోడు సరిపోతుందని పెద్దలందరి తీర్మానం. అమ్మా నాన్నల వృద్ధాప్యం, వారి వేడికోళ్ళు నచ్చచెప్పడాలు - అయిపోయింది. అంతా అయిపోయింది.

అమ్మా నాన్నలతో నా అభిప్రాయాలు చెప్పలేకపోయాను. అందరి తల్లిదండ్రుల్లాగే తమ బిడ్డా ఒక కుదురైన కుటుంబ జీవితం గడపాలని ఆశిస్తున్నారు. అవివాహితగా ఉండిపోవాలన్న నా కోరికను వారు జీర్ణించుకొనే స్థాయిలో లేరు.

అప్పుడే రంజిత్ సెలవులకు ఇంటికి వచ్చాడు. నా క్లినిక్‌లోనే మొదటిసారి కలిసాడు. తరచూ కలుస్తూనే ఉన్నాడు. రంజిత్‌లో నాకు అభ్యంతరం పెట్టాల్సిన అంశాలేవీ కనపబడలేదు. అన్నయ్యలాగా ఆదర్శాలు వల్లించలేదు కానీ, రంజిత్ భావాలు సంస్కారవంతంగానే ఉన్నాయి.

అంతే, మా పెళ్ళయిపోయింది.

అస్సాం, బర్మా బోర్డర్, మణిపురి పర్వతసానువుల్లో – మా సంసారానికి సౌందర్యమయ నేపథ్యాలై నిలిచాయి.

అన్నీ అమిరిన జీవితం. నాకు తెలియకుండానే నేను భద్రమహిళనై పోయాను. అలసిన జీవితం లోంచిఈ కొత్త ప్రపంచంలోకి హాయిగా అడుగు పెట్టాను. అన్నయ్య, అమ్మానాన్నలు, ఆనంద్, పార్టీ, ప్రాక్టీసు – ఆటుపోట్లు, నిరాశానిస్పృహలు – అన్నీ ఒక్కొక్కటిగా కాలపు పొరల్లోకి ఇంకిపోయాయి.

ఒక నిత్య నూతన అనుభవం నా ముందు రసవంతంగా ఆవిష్కరించబడింది. అలా అని నేను భావించసాగాను.

నన్ను నేను క్రమక్రమంగా ఒక గృహిణిగా మలుచుకోసాగాను. రంజిత్‌కు ప్రీతిపాత్రంగా జీవించడమే నా జీవితమై పోసాగింది. ఇది రంజిత్‌కూ బాగానే ఉంది. త్వరలోనే చూడ చక్కని జంటలా మంచి పేరు సంపాదించేశాం. ఇక, ఆ ఘనతను నిలబెట్టే బాధ్యతనూ నా భుజాలపై నిలుపుకొన్నాను.

కడిగిన గిన్నెలే కడగడం, సర్దిన ఇంటినే సర్దడం, అమర్చిన వస్తువులనే అమర్చడం – రానురానూ శుభ్రవతిని అయిపోసాగాను. ఒక చిన్నపిల్లలా అన్నింటికీ రంజిత్ నుంచి ఓ మెప్పుకోలును ఆశిస్తూ – రంజిత్ చుట్టూ బొంగరంలా తిరగసాగాను.

రంజిత్‌కు నచ్చిన వంటలే వండుతాను. తినే తిండినే తింటాను. అతనికి నచ్చిన తీరులో అలంకరణ చేసుకొంటాను. అతను చెప్పిన చీరనే సింగారిస్తాను. అతను కనుసైగ చేస్తే క్షణాల్లో ఆ పని పూర్తి చేసి శభాష్ అనిపించుకొంటాను. అతను మాట్లాడమన్న వారితో మాట్లాడతాను, వద్దంటే మానేస్తాను అలా అలా రంజిత్ నా ప్రపంచం అయిపోయాడు.

అలా, ఒక రోజు ఇద్దరమూ ఒక పార్టీకి వెళుతుంటే – కొందరు మణిపురి గిరిజన మహిళలు కనబడ్డారు.

మిలటరీ ఆఫీసర్ల కార్లను అటకాయిస్తూ.

వీధికి అడ్డంగా.

నగ్నంగా.

నేను నిర్ఘాంతపోయాను.

వారి భాష నాకు రాకపోవచ్చు. వారి చేతుల్లోని అట్టలపై ఏం రాసి ఉందో నేను చదవలేక పోవచ్చు. కానీ, వారి కళ్ళల్లోని ఆగ్రహం నా కంటబడకుండా పోలేదు.

వారి ముఖాల్లోని నిస్సహాయత, ఉద్వేగం, ఉద్రేకం, ఉత్తేజం – కలగలసిన ఒక వింత భావం నన్ను తాకక పోలేదు. నిలువెత్తు ప్రశ్నల్లా నిస్సిగ్గుగా నిలబెట్టారు వాళ్ళు – నాగరీకులం అనుకుంటున్న వాళ్ళందర్నీ.

రంజిత్‌ను అడిగాను. విషయం ఏమిటని.

మాట దాటేయడమే కాదు. నన్ను ఇక మాట్లాడనీయలేదు.

మొదటిసారిగా నేను మనుషుల్లో పడ్డాను, నా సంసారమైకం లోంచి.

నాదృష్టిని నా చుట్టూ సారించి చూడసాగాను. మ్యాగజైన్లు, వార్తా పత్రికలు తిరగేశాను. ఆ స్త్రీల ఆవేదన ఏమిటో అర్థం చేసుకోవడానికి నాకు ఎక్కువ సేపు పట్టలేదు.

వాళ్ళని వెతుక్కుంటూ వెళ్ళాను. సరిగ్గా అప్పుడే వారినందరినీ అరెస్టు చేసి వ్యానుల్లోకి ఎక్కిస్తున్నారు. టివి కెమెరాలు, పత్రికా విలేఖరులు, మనుషులు – మిలటరీ!

ఆ దురాగతాల వ్యవస్థలో నా భర్తా ఒక భాగం... అన్న ఆలోచన నన్ను కుదిపేసింది. ఇలాంటి అమాయకుల కంటి నీటితో తడిచిన జీతం డబ్బుతో

నేనొక భద్ర జీవితాన్ని మలుచుకున్నాను! సిగ్గుతో చితికిపోయాను. నిర్జీవమైనట్లుగా ఇంటికి తిరిగి వచ్చాను.

అప్పుడు తెలిసింది.

నాకు - రంజిత్ అంటే ఏమిటో!

మిలటరీ జులుం అంటే ఏమిటో!

నేను ఇంటికి తిరిగి వచ్చేలోగానే రంజిత్ ఏదో టివి ఛానెల్లో నన్ను చూశాడట.

మరెవరో ఆఫీసర్ ఫోన్ చేసి రంజిత్‌ని 'భార్యను అదుపులో పెట్టుకో'మని హెచ్చరించారట. అంతే! ఎవరో తట్టి లేపినట్లుగా, రంజిత్‌లోని ఒక భర్త...ఒక మిలటరీ ఆఫీసర్... ఒక్కసారిగా పడగ విప్పారు. బుసలు కొట్టారు. విషం చిమ్మారు.

ఒకసారి టివి తెరపై నన్ను చూశారో లేదో - ఎక్కడెక్కడి నుంచి వచ్చారో - శ్రేయోభిలాషులు - నన్ను రంజిత్‌ను విడదీసేస్తూ - మా ఇద్దరి నడుమ - అగాధాల సుడిగుండాలు సృష్టించేశారు.

నలుగురి నడుమ నన్నే పరీక్షకు నిలబెట్టారు. అణువణువునా.

నాపై నిఘా వేసేశారు. అనుక్షణం.

నా ప్రతి కదలిక, ప్రతి పలుకూ, ప్రతి చూపు - ఆపై వారెవరి దృష్టిని దాటలేదు. మానవ సంబంధాల ఉచ్చు బిగుసుకుపోయి నేనో మనిషినన్న విషయమే మరుగున పడిపోసాగింది.

నేనేమిటో - ఏమి చేస్తున్నానో - ఏమి ఆలోచిస్తున్నానో - అన్నీ మరిచిపోసాగాను.

"ఎంత పని చేశావ్ ? అతని ఉద్యోగం... అతని జీవితం... "

"ఇంత ఘోరమా ? పోయి పోయి ఆ ఉద్యమకారులను కలిసి వస్తావా?"

"పరువూ ప్రతిష్టల సంగతి ఆలోచించావా? ఛీ ఛీ... సిగ్గూ ఎగ్గూ లేకుండా వాళ్ళు రోడ్డు ఎక్కారే అనుకో తగుదునమ్మా అంటూ నువ్వెళ్ళి తందానా కొడతావా?"

"మిలటరీ నియమ నిబంధనలు ఆలోచించావా? అతని పీకల మీదికితెచ్చావ్!"

రంజిత్ వైపు ఆశగా చూశాను.

"అయినా నేనేం చేశానని? ఒక మారు వాళ్ళని దగ్గరగా వెళ్ళి చూడాలని ప్రయత్నించాను. వారి సమస్యలేమిటో తెలుసుకోవాలని అనుకున్నా. కనీసం వారి కంటి నీరైనా తుడవలేదే? సాటి మనిషి నిస్సహాయ పరిస్థితికి ఒక మనిషిలా స్పందించడమేనా నేను చేసిన నేరం? ఘోరాతి ఘోరం?"

రంజిత్ సహాయం కోసం ఒక చిన్న పిల్లలా చూశాను. ఆయన సమాధానమే నాకు ఊరట.

ఊహు!

అతను బిర్ర బిగుసుకుపోయి ఉన్నాడు తనలో తనే. చుట్టూ విరుచుకు పడుతోన్న మాటలన్నీ ఆయన శ్రద్ధగా ఏరి కూర్చి పెట్టినట్లుగా. మౌనంగా.

నమ్మలేక పోయాను, ముక్కలు ముక్కలై పోయాను. అతని చుట్టూ పెనవేసుకొన్న నా అనుభూతులు ఒక్కసారిగా విచ్చిపోయాయి.

నా రంజిత్!

నేను ప్రేమించిన నా భర్త. నేను అనుక్షణం అణువణువూ అపురూపంగా చూసుకున్న నా భర్త. ఎంతో గౌరవంగా నేను అభిమానించే నా భర్త.

నన్ను మురిపించి మరిపించిన నా రంజిత్!

ముద్దారగ చెప్పటానికి ఏం అడ్డొచ్చిందో – ఇలా నన్ను నలుగురి ముందుకు విసిరేశాడు. ఒక పులిస్తరాకు లా. ఒక లాబ్ స్పెసిమన్ లా.

ఆ నలుగురూ నన్ను నాలుగు వైపులకూ లాగి లాగి చించేశారు. ఛిన్నాభిన్నం చేశారు.

ఆ నలుగురూ నన్ను గుచ్చి గుచ్చి పరీక్షించారు. నా మానాభిమానాలతో పాటు నా ఆలోచనల అంతరాత్మనూ కుళ్ళబొడిచేశారు.

వారి తప్పేమీ లేదు.

వారి వారి చేతనాస్థాయి – అది!

కానీ, నన్ను ఎరిగిన నా మనిషి... ఇలా...!

తట్టుకో లేక పోయాను.

తల్లడిల్లి పోయాను.

అగధాల అడుగుల్లోకి... చీకటి గుయ్యారాల్లోకి... జారిపోసాగాను.

నిరాశా నిస్పృహ.

నిర్లిప్తమై మిగిలిపోసాగాను.

నా ప్రమేయం లేకుండా నా చుట్టూ ఒక వాతావరణం ఏర్పడుతోంది. అవాంఛనీయమైనది. నా వారంతా ఒక పక్షం, నేనొక పక్షం. రెండుగా విచ్చిపోసాగాం. దూరం క్రమక్రమంగా పెరిగిపోసాగింది.

నా శ్రేయోభిలాషులంతా ఎంతో సహృదయంతో సాయం చేయాలని వచ్చినవారే.

కానీ, వారెవరికీ తెలియలేదు, అర్థం కాలేదు.

వ్యక్తిగా నాలో మూర్తిమత్వం చెందిన కొన్ని విలువలు నన్ను జీవింపచేస్తాయని. సహజ మానవ స్పందనలకు నేను బందీనని. వాటిని విడిచి నేను శ్వాసించలేనని. అవి లేని నేను నేను కానని.

నా అభిప్రాయాల కోసం ఎవరూ వేచి ఉండలేదు. నా అనుభూతులు ఆలోచనలు ఎవరికీ అక్కరకు రాలేదు. అవి పూచిక పుల్లల పాటి చేయలేదు.

రంజిత్ సెలవు పెట్టేసి నన్ను ఢిల్లీకి తీసుకు వచ్చేశాడు. ఆ తరువాత ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

నన్ను అపరాధ భావనలోకి నెట్టేయాలన్న అందరి ప్రయత్నాలను ఎదిరించి నేను వంటరిగా పోరాడుతూనే ఉన్నాను. క్రమక్రమంగా నా శక్తియుక్తులు ఆవిరి అయిపోయాయి. నేను అలసి పోయాను.

ఎవరో పనిగట్టుకొని శ్రద్ధగా ముడిచి మడిచి ఒక నాళికలో ఇమిడ్చినట్లుగా - ఈ గాజు గదుల్లోకి కుంచించుకుపోసాగాను.

నిస్తేజమై మిగిలిపోసాగాను నానాటికీ.

అయినా, నా వేళ్ళ చివరన ఊపిరి ఆడుతుందేమో - నా ప్రమేయం లేకుండానే రేఖలు జాలువారుతున్నాయి. రంగులు దిద్దుకుంటున్నాయి. వెలుగులు నింపుకుంటున్నాయి. ఛాయలై మిగులుతున్నాయి.

నిజమే, ఎన్ని ప్రయత్నాలు చేశానో... ఎంత సంఘర్షణ పడ్డానో... ప్చ్...!

ఇంకా నేను తేరుకోలేదు. కొట్టుమిట్టాడుతూనే ఉన్నాను. కొడిగట్టి పోలేక.

అన్నయ్యకూ ఆనంద్‌కూ రంజిత్‌కూ మధ్య ఎక్కడో తచ్చాడుతూ తడబడుతూ -

*

అపర్ణా రంజిత్‌కు ఎలా వీడ్కోలు పలికానో నాకు జ్ఞాపకం లేదు. ఎలా నా వర్క్‌డెస్క్ ముందుకు వచ్చి కూలబడ్డానో ఆ స్పృహే లేదు.

నిశ్శబ్దం, నా చుట్టూ, గాఢంగా, నిగూఢంగా.

నా ఎదురుగా కంప్యూటర్ తెరపై అపర్ణ కుంచెలో రూపు దిద్దుకొన్న చిత్రం. డిజిటల్ ఇమేజ్‌ని క్లోజ్‌అప్‌గా జరుపుతూ - మరింత స్పష్టంగా చూడసాగాను.

ఎన్నెన్ని రంగుల మాటున ఛాయల్ని దాచి ఉంచిందో... ఎన్నెన్ని నల్లని రేఖలలో వెలుగుల్ని వెతికి చూసిందో... అయ్యో! అపర్ణా ...!

ప్రతిరేఖలో ప్రతి రంగులో ప్రతి కుంచె విసురులో - ఎంతటి జీవితేచ్ఛ! ఎంతటి స్వేచ్ఛాభిలాష!

వర్ణ రంజితమైన ఆ చిత్రం ఒకసారిగా వివర్ణమైనట్లుగా తోచింది.

వెలుగులన్నీ వెలిసిపోయినట్లుగా... మసకమసగ్గా - తెర మీద చిత్రం అలుక్కుపోయింది.

ఆశ్చర్యం.

నా కంటిలో నీటి పొర.

ఇదేమి తెలియని వ్యథ కాదు.

అయినా, తెలుసుకున్నప్పుడల్లా ఎందుకో గాని, కళ్ళు చెమ్మగిల్లడం మానలేదు.

అంటే అపర్ణ అన్నట్లుగా, ఇంకా మనిషిగా నేను బ్రతికే ఉన్నానన్నమాట!

'చెమ్మగిల్లని కళ్ళు, స్పందించని గుండె, సాటి మనిషిని స్పృశించని మనిషి మనుగడ ఎందుకు, అంది ఆమె.

అవును, ఆ ఆలోచనతోనే ఆమె కుంగిపోయింది.

"అన్నీ తెలిసిన వారు కదా... మరి ఎందుకు ఈ చీకట్లోంచి బయట పడడానికి ప్రయత్నం చేయలేదు?" మెత్తగానే అయినా సూటిగా అడిగాను.

"చేశాను. ఎన్నో ప్రయత్నాలు. ఎందరెందరితోనో పోరాడాను. కానీ, వాళ్ళంతా ఎవరు? నా వాళ్ళు. అయిన వాళ్ళు. నన్ను కన్నవాళ్ళు. నన్ను కట్టుకొన్న వాళ్ళు. నేను కన్నవాళ్ళు!"

"మీరొక డాక్టర్..."

"మర్చిపోయాను. ఆ తరువాత గుర్తొచ్చేసరికి ఏ ఒక్క జబ్బు గుర్తుకు రాలేదు. చికిత్సలూ గుర్తుకు రాలేదు. ఎంతో ప్రయత్నించాను. పుస్తకాల బూజు దులిపి. ఒక్క ముక్కా బుర్రను పట్టలేదు. మరింత కుంగిపోయాను. నీకు తెలుసా – ఒకప్పుడు నేను అనాటమీలో గోల్డ్ మెడల్ అందుకున్న విద్యార్థిని. ఒక్క శరీర భాగం గుర్తుకు రావడం లేదు. ఎవరో శ్రద్ధగా తడిగుడ్డతో తుడిచేసినట్లుగా నా తలలోని దంతా మటుమాయం. నేను నిర్ఘాంతపోయాను. నిలబడిపోయాను. ఏకాకిగా." అపర్ణ ఓ క్షణమాగి అన్నది "నేను క్లినికల్‌గా డిప్రెషన్‌లోకి జారిపోయాను. నా ప్రొఫెసర్లే నా గాయం మాన్పలేకపోయారు. నేను కుంగిపోయాను. ముడుచుకు పోయాను! ఐ వజ్ క్లినికల్లీ డిప్రెస్డ్!"

నేను కళ్ళు గట్టిగా మూసుకకొన్నాను. అపర్ణ మాటలు నన్ను చుట్టుముట్టేసాయి. తల విదిల్చుకొని సర్దుకొని కూర్చున్నాను. చిత్రపు క్లోజ్ అప్ షాట్‌ని నాకు తెలియకుండానే శ్రద్ధగా చూడసాగాను. చాలా జాగ్రత్తగా.

దళసరి గాజు బీకరులో ఇమిడ్చి వుంచిన స్త్రీ.

ఆమె శ్వాసిస్తూనే ఉంది, ఆమె గుండె లయబద్ధంగా ధ్వనిస్తూనే ఉంది.

ఆ రహస్యం నాకు మాత్రమే తెలుసు.

చిత్రం!

ఇంత వరకూ నా కంట పడని ఓ సన్నని పగులు – ఆ గాజు బీకరు మీద.

ఆ దళసరి గాజు బీకరు విచ్చిపోతుంది. ఆ సజీవ స్త్రీ మూర్తి రెక్కలు విప్పుకున్నట్టుగా పైకి కదులుతోంది. చిరునవ్వుతో.

కళ్ళు చికిలించి చూశాను.

అలాంటిదేమీ లేదు.

అది మామూలుగానే ఉంది.

చిత్త భ్రమ. వట్టి భ్రాంతి.

"బీ ప్రొఫెషనల్" నా భుజం నేనే తట్టుకొని నా లోకం లోకి వచ్చి పడ్డాను. అయినా, అపర్ణ మాటలు నా చుట్టూ. నా లోలోన.

"అన్నయ్యలా పారిపోలేక పోయాను. ఆనంద్ లా అమరత్వం పొందలేక పోయాను. రంజిత్ లా వ్యవస్థీకృతమై రాజీ పడలేక పోయాను. అయినా, నేను జీవించే ఉన్నాను. జీవిస్తూనే ఉన్నాను."

చెవులు గట్టిగా మూసుకొని, డెస్క్‌పై తల వాల్చాను.

ధామ్మని శబ్దం!

నా చిన్ననాటి స్నేహితురాలు అపర్ణ.

అరరే... అలా భద్రంగా మోసుకు వస్తోన్న బీకరుతో సహా - ఎదురుదెబ్బ తగిలి ముందుకి పడిపోయిందే! పదిలంగా పట్టుకొస్తున్న ఆ జీవ రహితమైన హృదయం అలా ఛిద్రమై చిన్నాభిన్నమై పోయిందే...! అయ్యయ్యో - గుండెలో గుచ్చుకొన్న ఆ సన్నటి గాజు ముక్కల్ని జాగ్రత్తగా తీయాలి సుమా...!

ఆమె చిన్నారి అపర్ణా? ఏమో?

కాకపోవచ్చు.

అపర్ణా రంజిత్ ?!?

అవును. ఆమె ప్రతి పలుకు నాలోకి ఇంకిపోయింది.

"ఆనంద్ పోరాడి ప్రాణమొడ్డి తనవారిలో వీరుడయ్యాడు.

క్షణ క్షణం మరణిస్తూ నా వారందరితో నేను పోరాడుతూనే ఉన్నా -"

ఫెటిల్మని శబ్దం!

గాజుబీకరు భళ్ళున బద్దలయ్యింది!

ఈ సారి - నిజంగానే!!

ఎక్కడో తెలియదు కానీ....

వేడెక్కిన గాజుపై చల్లటి నీటి చుక్క -

ఒకే ఒక్కటి -

అంతే - !!!

రచన

ప్రారంభం 22 మార్చి 2006

ముగింపు 31 అక్టోబర్ 2006